క్లుప్తంగా

రాష్ట్ర క్రికెట్ జట్టుకు మోక్షిత ఎంపిక



ఏలూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ బాలికల రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఏలూరు క్రీడాకారిణి మావూరి మోక్షిత ఎంపికయ్యింది. ఇటీవల మంగళగిరిలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలికల జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న మోక్షిత బ్యాటింగ్‌తో సత్తా చాటి సెలెక్టర్ల మన్ననలు పొంది, రాష్ట్ర జట్టు స్టాండ్‌బైలో చోటు సాధించింది. ఈ నెల 17వ తేదీ నుంచి డెహ్రాడూన్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో మోక్షిత పాల్గొననుంది. ఏలూరు సర్‌సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న మోక్షిత రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడంపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి వీవీఎస్ శ్రీనివాసరాజు, కోచ్ సత్యనారాయణ సంతోషం వ్యక్తం చేసారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో డిపాజిట్లపై అధిక వడ్డీ



దెందులూరు బ్యాంకు శాఖలో మాట్లాడుతున్న మేనేజర్ నాగార్జున

దెందులూరు: డిపాజిట్లపై అత్యధిక వడ్డీ చెల్లిస్తున్న ఏకైక ప్రభుత్వ రంగ బ్యాంకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అని దెందులూరు శాఖ మేనేజర్ నాగార్జున, క్యాషియర్ రామకృష్ణ శనివారం అన్నారు. ఏడాది నుంచి రెండేళ్లలోపు జనరల్ సిటిజన్‌కు 8.10 శాతం వడ్డీ, సీనియర్ సిటిజన్స్‌కు 8.60 శాతం వడ్డీ ఇస్తున్నామన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీ రేటు అందిస్తామని వారన్నారు.

నకిలీ పట్టాపై చర్యలు తీసుకోవాలి

దెందులూరు: ఏలూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట ఈ నెల 15 నుంచి నిరాహార దీక్షలు చేపడుతామని పోతునూరు గ్రామానికి చెందిన వీరబాపూజీ, కోటేశ్వరరావు అన్నారు. శనివారం దెందులూరులో వారు మాట్లాడుతూ పోతునూరు గ్రామానికి చెందిన విజయలక్ష్మి నకిలీ పట్టా పుట్టించారని,దీనిపై జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేశామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు దెందులూరు తహసీల్దార్ విచారణ నిర్వహించి విజయలక్ష్మి వద్ద ఉన్న పట్టా నకిలీదని తేల్చి, దీనిపై కలెక్టర్‌కు నివేదిక అందించారని తెలిపారు. తహసీల్దార్ నివేదిక మేరకు నకిలీ పట్టాను రద్దు చేయమని, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఏలూరు ఆర్డీవోకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా కాలాయపన చేస్తున్నారని వారు ఆరోపించారు.

పేదల సొంతింటి కల సాకారం

- ఎమ్మెల్యే ఆళ్ల నాని
- 63మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అర్హులందరికీ సొంతింటి కల సాకారం చేసే దిశగా పటిష్ట కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని మాజీ ఉపముఖ్యమంత్రి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని స్పష్టం చేశారు. స్థానిక 19వ డివిజన్, సుందరయ్య కాలనీకి చెందిన 63 మందికి శనివారం నాని ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పూరి పాకలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు వారి ఇళ్లపై శాశ్వత హక్కు కల్పిస్తున్నామన్నారు. ఇంటి స్థలంతో పాటు ఇళ్ల నిర్మాణం కోసం రూ. 1.80 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అర్హులందరికీ న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్న తమ సమస్యపై స్పందించి, పట్టాలు మంజూరు చేసిన ఆళ్ల నానికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నాగబాబు, డిప్యూటీ మేయర్ లు ఎన్. సుధీర్ బాబు, గుడిదేసి శ్రీనివాసరావు, తహసీల్దార్ బీ. సోమశేఖరరావు, మున్సిపల్ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మాలధారులకు భిక్ష అందించడం పవిత్ర కార్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అయ్యప్పస్వామి, భవానీ తదితర మాలధారులకు భిక్ష ఏర్పాటు చేయడం పవిత్ర కార్యమని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని అన్నారు. స్థానిక బాలాజీ థియేటర్ రోడ్డులోని లింగమల్లు శ్రీనివాసేంద్రబాబు మిల్లు ఆవరణలో నిర్వహిస్తున్న అయ్యప్ప అన్న సమారాధనోత్సవంలో శనివారం ఎమ్మెల్యే నాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ నగర ప్రజలు ఆధ్యాత్మిక చింతనలో ఎప్పుడూ ముందుంటారని, ప్రతి దేవాలయంలో నిత్యం ఏదో ఒక ఆధ్యాత్మిక ఉత్సవం నిర్వహించడం నగరానికి ఉన్న ప్రత్యేకత అన్నారు. లింగమల్లు శ్రీనివాసేంద్రబాబు మిల్లు ఆవరణలో 18 ఏళ్లుగా ఏటా అయ్యప్ప దీక్షా స్వాములకు ఉదయం వడ్డె, మధ్యాహ్నం భిక్ష కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆధ్యాత్మిక సేవ చేస్తున్న కమిటీ ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. 17వ రోజు భిక్ష కార్యక్రమంలో పాల్గొన్న నానికి తొలుత వేద మంత్రాల నడుమ పూర్ణకుంభంతో కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నాని అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేసి పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం కమిటీ ప్రతినిధులు నానిని దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా స్వామియే శరణం అయ్యప్ప నామ స్మరణతో ప్రాంగణం మార్మోగింది. ప్రతి రోజూ వందలాది మంది అయ్యప్ప, భవానీ, శివమాల, హనుమాన్ దీక్షాధారులకు దాతలు వడ్డె, భిక్ష అందజేస్తున్నట్టు కమిటీ సభ్యులు నానికి తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 19 తేదీ నుంచి ప్రారంభమైన అన్న సమారాధనోత్సవం డిసెంబర్ 6 తేదీ వరకు 49 రోజులు నిర్విరామంగా కొనసాగుతుందని వివరించారు. శనివారం చక్కా వెంకట్రామ సత్యనారాయణ మూర్తి దీక్షా స్వాములకు వడ్డె, భిక్ష అందజేశారు. తొలుత అయ్యప్ప స్వామికి పూజలు చేసి హారతి ఇచ్చారు. కార్యక్రమాలను ఏలూరు అయ్యప్ప అన్న సమారాధన కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



19వ డివిజన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఎమ్మెల్యే ఆళ్ళ నానిని సత్కరిస్తున్న అయ్యప్ప అన్నసమారాధన కమిటీ సభ్యులు

దూర విద్య కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ప్రవేశాలు పొందడానికి గడువు తేదీని పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పీ. శ్యామ్ సుందర్ తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 6 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత అధీకృత స్టడీ సెంటర్ల ద్వారా, ఏపీఓఎస్ స్కూల్ వెబ్‌సైట్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చన్నారు.

భగవద్గీత పోటీల్లో భువనేశ్వరి ప్రతిభ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బెంగళూరుకు చెందిన విద్యాధరి ఇనిస్టిట్యూట్ సంస్థ ఆధ్వర్యంలో కళా సౌరభ పేరిట అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో నగరానికి చెందిన గుబిలి భువనేశ్వరి మూడో స్థానంలో నిలిచింది. స్థానిక శ్రీరామ్‌నగర్‌లోని ప్రైవేటు స్కూల్లో విద్యాభ్యాసం చేస్తున్న భువనేశ్వరి ఇప్పటికే పలు జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటింది. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో భువనేశ్వరి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. భగవద్గీతలోని 18 అధ్యాయాలు, 700 శ్లోకాలను అలవోకగా చెప్పడమే కాక వాటి భావాలను వివరించడంలో భువనేశ్వరి ప్రత్యేకత కలిగి ఉంది. అంతర్జాతీయ స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిన భువనేశ్వరిని స్కూల్ డైరెక్టర్ వీ. సురేష్, ప్రిన్స్‌పాల్ కడియాల విజయలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు.

రచనా వ్యాసంగంతో భాషపై పట్టు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రచనా వ్యాసంగంతో ప్రతి ఒక్కరిలో భాషపై పట్టు లభిస్తుందని సీఆర్ఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ పీ. శైలజ తెలిపారు. స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో వివిధ హోదాల్లో పని చేసిన కన్నెగంటి అనసూయ రచించిన తపన అనే పుస్తకాన్ని శనివారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భాషపై అభిమానంతో అనేక మంది రచనలు చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. కన్నెగంటి అనసూయ తమ కళాశాలలో 11 ఏళ్ల పని చేసి అనంతరం రాజీనామా చేసి రచనలపై దృష్టి కేంద్రీకరించి అనేక రచనలు చేశారన్నారు. ఆమె చేసిన రచనలకు అనేక పురస్కారాలు అందుకోవడం అభినందనీయమన్నారు. ఆమె అందుకున్న పురస్కారాల్లో రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం అందించే పురస్కారం, బాల సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రధానమైనవన్నారు. ఆమె రచించిన అన్ని పుస్తకాలనూ కళాశాల లైబ్రరీకి ప్రతులను బహుమతులుగా ఇవ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఆర్ కళాశాల రిటైర్డ్ కామర్స్ అధ్యాపకురాలు విశ్వశాంతి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



తపన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఆర్ఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ శైలజ

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డ్రైవర్లు రహదారి నిబంధనలను పాటిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కే విజయరాజు విజ్ఞప్తి చేశారు. ఏలూరు జూట్‌మిల్ సెంటర్ వద్ద శనివారం నిర్వహించిన రహదారి భద్రత అవగాహన సదస్సులో విజయరాజు, ఏలూరు నగర ట్రాఫిక్ సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్ డ్రైవర్ల నుద్దేశించి మాట్లాడారు. రహదారి నిబంధనలను పాటించాలని, డ్రైవర్లు అందరూ యూనిఫామ్ ధరించాలని, లైసెన్స్ వాహన పత్రాలను క్రమబద్ధీకరించుకోవాలని కోరారు. నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న వారిలో ఎక్కువ మంది యువకులే ఉన్నారని, నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలియజేశారు. రవాణా రంగ కార్మికులకు వారి కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా సమగ్ర సంక్షేమ బోర్డును (వెల్ఫేర్ బోర్డు) ఏర్పాటు చేయాలని ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో, దేశంలో రవాణా రంగం నుంచి కోట్లాది రూపాయలు ఆదాయాన్ని సంపాదిస్తున్న ప్రభుత్వాలు డ్రైవర్ల సంక్షేమంపై నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రవాణా రంగ చట్ట సవరణ పెను ప్రమాదంగా మారిందని, రాష్ట్రంలో జీఓ నంబర్ 21 వల్ల అపరాధ రుసుములు అనేక రెట్లు పెరిగాయని, పెంచిన రోడ్డు ట్యాక్స్, గ్రీన్ ట్యాక్స్‌ను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. రహదారుల మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. లింగరాజు డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక అవగాహన సదస్సులను ప్రభుత్వమే నిర్వహించాలని అమరావతి లారీ అసోసియేషన్ కార్యదర్శి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. రహదారి భద్రత అవగాహన సదస్సుకు ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బుద్ధ నాగ సూరిబాబు, జీ. గోపి, సీహెచ్ అమరకుమార్, జీవీ రవీంద్రబాబు, ఎం. ఇస్సాకు, ఏ. జానుబాబు నాయకత్వం వహించారు. ఈ సదస్సుకు హాజరైన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కే. విజయరాజు, ఏలూరు నగర ట్రాఫిక్ సీఐ ప్రసాద్‌ను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు.



రహదారి భద్రత అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంవీఐ విజయరాజు

ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు నగరపాలక సంస్థ యాజమాన్యంలోని వివిధ పాఠశాలల్లో ఎస్టీ బ్యాక్‌లాగ్ స్కూల్ అసిస్టెంట్, సబ్జెక్టు టీచర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం ఏలూరు జిల్లా నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి పీ. శ్యామ్ సుందర్‌ను కోరారు. జిల్లా విద్యాశాఖాధికారిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏలూరు నగరపాలక సంస్థ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్టుల్లో ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని అర్హులైన ఎస్టీ ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని కోరారు. డీఈఓకు వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘ జిల్లా అధ్యక్షుడు భూక్యా రాము, కోశాధికారి ఇస్లావతు బాలాజీ తదితరులున్నారు.

వైద్య వృత్తిలో ఉత్తమ ప్రమాణాలు నెలకొల్పాలి

ఏలూరు రూరల్ : ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఆశ్రం విద్యార్థులు ఉత్తమ ప్రమాణాలు నెలకొల్పాలని యుహెచ్ఎస్ మాజీ వైస్ చాన్సలర్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఐవీ రావు అన్నారు. శనివారం మల్కాపురంలో ఆశ్రం వైద్య కళాశాల వార్షిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య విద్యార్థులు అంకితభావంతో పనిచేస్తే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. యాజమాన్యం, బోధన సిబ్బంది కృషితో వైద్య విద్యార్థులు రాణించి, ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. ఆశ్రం సొసైటీ చైర్మన్ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ ప్రపంచస్థాయి మౌలిక వసతులు, సాంకేతిక, ప్రమాణాలు కల్పించడం వల్ల ఆశ్రం విద్యార్థులు జాతీయ, యూనివర్సిటీ పోటీల్లో రాణిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సంగీత, వినోదాత్మక కార్యక్రమాలు అలరించారు. ఈ కార్యక్రమానికి మరో ముఖ్యఅతిథిగా హాజరైన ఇండియన్ టేబుల్ టెన్నిస్ ప్లేయర్ నైనా జస్వాల్, ఆశ్రం సొసైటీ డైరెక్టర్ జి రతీదేవి, డాక్టర్ కె అంజిరెడ్డి, సీఈఓ డాక్టర్ కె హనుమంతురావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి కృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేబ్రోలు శ్రీనివాస్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమం ముగింపు సమయంలో విద్య, క్రీడలు, సంస్కృతిక పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను నిర్వాహకులు అభినందించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.



ఆశ్రం కాలేజీ డే కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	15
డీ.తిరుమల ఏలురు బీహెచ్ఈఎల్	22.15	20
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	20
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	29

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	06
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	18
ఏలూరు బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	01
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	08
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	33
ఏలూరు బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	98512	--
ఏలూరు బీహెచ్ఈఎల్	22.30	98506	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	32	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	18	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	10-12
బెండకాయలు	20	కంద	60
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	40
కాకర కాయలు	20 - 24	కీరా దోస	40
బీరకాయలు	20	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	20	అల్లం	130
క్యారెట్	40 - 48	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	16	పాలకూర	12
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	60	తోటకూర	12
గోరుచిక్కుడు	30	గోంగూర	07
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	15- 20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	30
		నిమ్మకాయలు (డజను)	--

9న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఏలూరు రూరల్: ఈ నెల 9న ఏలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బి ప్రణవి చెప్పారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరలో నిర్వహించే ఈ సమావేశంలో అభివృద్ధి పనుల ప్రగతి నివేదికపై ఎంపీటీసీలు చర్చిస్తారని తెలిపారు. రెవెన్యూ, విద్య, ఆరోగ్య, హౌసింగ్, ట్రాన్స్‌కో తదితర మండలస్థాయి అధికారులతో పాటు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకానున్నారని వివరించారు.

ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్‌గా నాగేశ్వరరావు



దెందులూరు: దెందులూరు మండల ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్‌గా ఎ.నాగేశ్వరరావు శనివారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. నిడమర్రు తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసి దెందులూరుకు బదిలీపై వచ్చారు.

రెండు లక్షల శివలింగాలు సిద్ధం

దెందులూరు: దెందులూరు శ్రీ రామదండు ఆధ్వర్యంలో ఏడు రోజులుగా 2 లక్షల మట్టి శివలింగాలను తయారు చేసినట్టు కమిటీ సభ్యులు జీ. గోపాల్ తెలిపారు. శనివారం దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో తయారు చేసిన 2 శివలింగాలను శనివారం ఆయన పరిశీలించి దెందులూరు గ్రామ భక్తులను, శ్రీరామదండు కమిటీ సభ్యులను, తయారు చేయించిన కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజును, డైరెక్టర్ సత్యనారాయణను అభినందించారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి శివుని పంచామృతాలు, కలశాలలతో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 108 మంది ముత్తైదువులకు పసుపు, కుంకుమలు ఇచ్చి కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని కరస్పాండెంట్ నూకరాజు అన్నారు.

దెందులూరు నియోజకవర్గంలో 2,21,301 ఓటర్లు



ఈఆర్వో సత్యనారాయణ

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో 2,21,301 ఓట్లు ఉన్నాయని పురుషులు 1,08,241, మహిళలు 1,13,052, ట్రాన్స్‌జెండర్లు 8 మంది ఉన్నారని దెందులూరు నియోజకవర్గ ఈఆర్వో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గం మొత్తం ఫారం- 7కు 13,960 దరఖాస్తులు వచ్చాయన్నారు. జనవరి 5వ తేదీన ఫైనల్ ఓటరు లిస్టును ఎన్నికల సంఘం ప్రకటిస్తుందన్నారు. ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ అని ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు ఉన్నదో లేదో పరిశీలించుకోవాలన్నారు. నేషనల్ ఓటర్ సర్వీస్ పోర్టల్. ఇన్ వెబ్‌సైట్‌లో మొబైల్ నంబరు, ఓటరు కార్డుకు లింక్ చేసి ఉండాలన్నారు. శని, ఆదివారాలు ఓటర్ల నమోదు శిబిరం ప్రతి గ్రామంలో నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 2,3 తేదీల్లో ఓటర్ల నమోదు కార్యక్రమం మరోసారి నిర్వహిస్తామన్నారు. దెందులూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 239 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. జీరో డోర్ నంబర్ పేరిట గల ఓట్లు 87, ఒకే ఇంటి డోర్ నంబరుపై 10 మంది కంటే ఎక్కువ ఉన్న ఓటర్లు 641 మంది ఉన్నారన్నారు. 26.10.23న ఓటర్ల నమోదు యాప్ నిలిచిపోయిందన్నారు. డబుల్ ఎంట్రీ, డెత్, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయినవారి ఓట్లు తొలగించామన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ప్రతి ఉద్యోగి అంకితభావంతో విధులు నిర్వహించాలని ఈఆర్వో సత్యనారాయణ తెలిపారు. ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



కొత్తగూడెంలో సీఎంఆర్ఎఫ్ చెక్కును మహేష్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: చెట్టుపై నుంచి పడి నడుం విరిగి వైద్య చికిత్స పొందుతున్న గాలాయగూడెంకు చెందిన దర్శిన మహేష్‌కు శనివారం కొత్తగూడెంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి రూ.70 వేలు చెక్కును అందించారు. కొత్తగూడెంలో ఇటీవల చలమలశెట్టి దశరధరామారావు మృతి చెందారు. శనివారం ఆయన కుమారుడు వెంకటరమణను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరామర్శించారు. దశరధరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో కొత్తగూడెం సర్పంచ్ పరసా లక్ష్మీసుజాత కనకరాజు, గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, కొత్తగూడెం సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, నాయకులు తోట అచ్చియ్య, మునునూరు వెంకటేశ్వరరావు, ఉదయ్‌భాస్కర్, సత్తిబాబు, జిల్లా కార్యదర్శి పులవర్తి సంతోష్, ఎంపీటీసీ పులవర్తి వరమణి తదితరులున్నారు.

వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే కొఠారు

దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. దెందులూరు, పెదపాడు మండలం నుంచి వచ్చిన ప్రజలు సమస్యలు విని ఎమ్మెల్యే కార్యాలయ రిజిస్టర్‌లో నమోదు చేయించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.